క్లుప్తంగా

ఘనంగా శ్రీరామకృష్ణుల జయంతి


హోమం నిర్వహిస్తున్న స్వామి వినిశ్చలానందజీ

సీటీఆర్ఐ: భగవాన్ శ్రీరామకృష్ణులు 188వ జయంతి సందర్భంగా మంగళవారం శ్రీరామకృష్ణ మఠంలో జన్మతిథి పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు మంగళ హారతి, సుప్రభాతం, వేద పఠనం జరిగాయి. ఉదయం 10 గంటలకు హోమం జరిపారు. శ్రీరామకృష్ణ జీవితం, సందేశంపై స్వామి వినిశ్చలానందజీ, స్వామి వేద విద్యానందజీ ప్రసంగించారు. కార్యక్రమంలో స్వామి రఘువీరానందజీ, స్వామి ప్రజ్ఞానాథానందజీ, బ్రహ్మచారి అమిత్ పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

ఆర్థిక సాయం

కడియం: కడియపుసావరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గల్లా దుర్గ కుమార్తె గల్లా నాగ లక్ష్మి తలసేమియాతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆమె చికిత్స కోసం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

రెప్కో బ్యాంక్‌లో ప్రత్యేక పథకం

రాజమహేంద్రవరం సిటీ: భారత ప్రభుత్వ రంగ బ్యాంక్ రెప్కో బ్యాంక్‌లో అధిక వడ్డీ కల్పనకు రెప్కో –15 నూతన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు రెప్కో బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.పవన్‌చంద్ర మంగళవారం ప్రకటించారు. నూతనంగా పారంభమైన ఈ పథకంలో 15 నెలల కాలపరిమితితో డిపాజిట్ చేసిన మొత్తానికి సీనియర్ సిటిజన్లకు 8.55 శాతం, ఇతరులకు 8.05 శాతం వడ్డీ ఇవ్వనున్నామన్నారు. డిపాజిట్‌దారులు వడ్డీని నెల, మూడు, ఆరు నెలలకు ఒకసారి తీసుకునే అవకాశం ఉందన్నారు. నగరంలోని రెప్కో బ్యాంక్ టి.నగర్ శాఖలో అందిస్తున్నామని, ఆసక్తి కల మదుపుదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంహితలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో మంగళవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగాలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటికి 62 మంది హాజరుకాగా 16 మంది బ్యాంకింగ్ ఆపరేషన్స్, కస్టమర్ రిలేషన్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టీఎస్ఎన్ మూర్తి, కళాశాల ఏవో జి.బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం



కంబాలచెరువు: స్థానిక పుష్కరాల రేవు వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. వారి సమాచారం మేరకు మూడో పట్టణ పోలీసులకు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతురాలి వయసు సుమారు 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లు ఉంటుంది. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

వైభవంగా కల్యాణోత్సవం


సువర్చల, ఆంజనేయస్వామి

కడియం: కడియపులంకలోని ఆంజనేయ స్వామి ఆలయం 73వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి సువర్చల ఆంజనేయస్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈనెల 18వ తేదీ నుంచి స్వామివారి ఆలయం వద్ద విశేష పూజా కార్యక్రమాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు.

నేడు సెల్‌ఫోన్ టెక్నీషియన్ల సమావేశం

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నటరాజ్ థియేటర్ వద్ద గల అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో ఉభయగోదావరి జిల్లాల సెల్‌ఫోన్ టెక్నీషియన్ల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ మంగళవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు.'నేటి వ్యాపారం కోసం, రేపటి వ్యాపార భద్రత కోసం' అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తొమ్మిదేళ్ల కాలుష్యానికి చెక్

- కలెక్టర్ చొరవతో డంపింగ్‌యార్డు తొలగింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


బొమ్మూరులోని డంపింగ్‌యార్డు

రాజమహేంద్రవరం రూరల్: నాలుగు గ్రామపంచాయతీల చెత్తను తీసుకువచ్చి డంపింగ్‌యార్డులో వేసి తగలబెట్టడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. కాలుష్యం కారణంగా రోగాల బారినపడుతున్నామని ఆందోళనలు చేశారు. చివరకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత చొరవతో గ్రామ పంచాయతీలలో చెత్తను ఆయా గ్రామాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించడంతో డంపింగ్ యార్డును తాత్కాలికంగా మూసివేశారు.

వివరాలు ఇవీ..

బొమ్మూరు పంచాయతీ పరిధిలోని సుద్దకొండ వద్ద గల ఖాళీ ప్రదేశంలో ఆ గ్రామంతో పాటు ధవళేశ్వరం, పిడింగొయ్యి, హుకుంపేట పంచాయతీల చెత్తను తొమ్మిదేళ్ల నుంచి తరలిస్తూ వస్తున్నారు. ఈ చెత్తను కొంతమేర గోతుల్లో తోసేసినప్పటికీ మంట పెట్టడం జరిగేది. దీనివల్ల పొగ పైకిలేవడంతో బొమ్మూరు గ్రామంలోని జేఎల్‌బీ నగర్, ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ కాలనీ, నేతాజీ నగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు కాలుష్యం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై తరచూ ఆప్రాంత ప్రజలకు, అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. చెత్తను అంటించడం వల్ల పొగలు వ్యాపించి స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురయ్యేవారు. ఇటీవల ఆ ప్రాంత ప్రజలందరూ ఈ సమస్యలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత దృష్టికి తీసుకువెళ్లారు.

స్పందించిన కలెక్టర్

మానవతాదృక్పథంతో ఆలోచించిన కలెక్టర్ వెంటనే ప్రజల కోరిక మేరకు జిల్లా పంచాయతీ అధికారి కె.జగదాంబకు డంపింగ్ యార్డు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వెంటనే ఆమె, డీఎల్‌పీవో జె.సత్యనారాయణ, సంబంధిత పంచాయతీ కార్యదర్శులను సదరు గ్రామపంచాయతీలకు చెందిన ఆయా గ్రామాల్లోనే డంపింగ్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి పిడింగొయ్యి, హుకుంపేట, ధవళేశ్వరం పంచాయతీల చెత్తను ఆయా గ్రామాలలో ఖాళీ ప్రదేశాల్లోనే డంపింగ్ చేసుకుంటున్నారు. బొమ్మూరులోని చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. దీంతో తొమ్మిదేళ్లుగా ఉన్న డంపింగ్‌యార్డు సమస్యకు చెక్ పడింది. దీంతో జేఎల్‌బీ నగర్ తదితర ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


ఎస్‌కేఆర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


డైట్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

కంబాలచెరువు: తెలుగు భాషను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గొల్లపూడి వీరస్వామి సంస్థ చైర్మన్ గొల్లపూడి వెంకట రమణమూర్తి అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీ మోటార్స్ ఎండీ ఎస్ఎస్ఆర్ గుప్తా మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుపై క్విజ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఏ.రాజబాబు, లయన్స్ అధ్యక్షులు ఎం.మాధవరావు, ఎస్.శ్రీనివాసరావు, ఫాస్టెస్ట్ డిస్టిక్ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, చైతన్య, డాక్టర్ డీవీ రమణమూర్తి, జి.శరత్ బాబు పాల్గొన్నారు.

- స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి డీఈడీ మహిళా కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. తెలుగు అధ్యాపకురాలు ఎం.విశాలాక్షి మాట్లాడుతూ మాతృభాషకు తొలిబడి తల్లిఒడేనన్నారు. మాతృభాషలేనిదే మానవజాతి మనుగడ లేదన్నారు. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ టి.ఝాన్సీలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ వేణు, లత, సిబ్బంది పాల్గొన్నారు.

డైట్‌లో

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం –2020 కూడా ప్రాథమిక స్థాయిలో మాతృభాషకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. లెక్చరర్ కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషలోని చమత్కారాలకు సంబంధించిన అనేక అంశాలను ఉటంకించారు. లెక్చరర్ బాలరాజు తెలుగు భాషా సౌందర్యం గురించి ఆకట్టుకొనేలా ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగాధర్, సత్యనారాయణ, సుజాతా రత్నం, చూడామణి, కళావతి, వీరభద్రరావు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలు మరింత మెరుగు


ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ వైద్య సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నాబార్డు నిధులతో జరుగుతున్న నాడు–నేడు పనులు, ఆంధ్రా పేపర్‌మిల్లు సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పలు యంత్ర పరికరాలను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొడ్డా బుజ్జితో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ చిన్న కేసునైనా పెద్దాసుపత్రులకు రిఫర్ చేసేవారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది, అవసరమైన పరికరాలను ఏర్పాటు చేయడంతో ప్రతిరోజూ వచ్చే రోగులు పెరిగారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారి సంఖ్య పెరిగిన నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌ను గిరజాల కోరారు. ఆయన వెంట కడియపుసావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, శివాలయం కమిటీ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, స్థానిక నాయకుడు పసల నాయుడు ఉన్నారు.

'భౌతికదాడులకు కుట్ర'

రాజమహేంద్రవరం రూరల్: తమ పార్టీ అధినేత చంద్రబాబుపై భౌతికదాడులకు కుట్ర జరుగుతుందని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు,రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆరోపించారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడారు. చంద్రబాబును అంతం చెయ్యాలనే ఆలోచనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ వల్లే వల్లభనేని వంశీ ఇన్నాళ్లూ బతికి బట్ట కట్టాడన్నారు. చంద్రబాబు,లోకేష్‌లు పిలుపునిస్తే పదివేల మంది కార్యకర్తలతో వంశీని చుట్టుముడతామని గోరంట్ల హెచ్చరించారు. వంశీ ఏపార్టీయో సీఎం జగన్ ప్రకటించాలన్నారు. ఈసమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, మార్ని వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం

సీటీఆర్ఐ: మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా మంగళవారం మార్కండేయేశ్వరస్వామికి స్థానిక మార్కండేయఘాట్‌లో చక్రస్నానం నిర్వహించారు. రాత్రి పుష్పార్చనతో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాగోలు శ్రీనివాస్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా డ్రైనేజీ


డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ పరిధిలోని ఆల్కాట్‌తోట ప్రాంతం రైల్వేస్టేషన్ నుంచి జూనియర్ కళాశాల వచ్చే రోడ్డుపై మురుగునీరు పొంగిపొర్లుతోంది. డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అలాగే డ్రైనేజీలో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. నగర పాలకసంస్థ అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ల అభివృద్ధికి సహకరించండి


ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఆర్టీసీ చైర్మన్‌కు వినతి

రాజానగరం: నియోజకవర్గంలోని కోరుకొండ, దివాన్ చెరువు, రాజానగరం బస్టాండ్‌లను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలో ఆయనను కలిసి, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలోని బస్టాండ్‌ను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బస్టాండ్ అభివృద్ధికి సుమారు రూ.75 లక్షలు అవసరమన్నారు. దివాన్ చెరువులో ప్రయాణికుల అవసరార్థం బస్టాండ్‌ను నిర్మించాల్సి ఉందన్నారు. రాజానగరంలోని బస్టాండ్‌లో మరుగు సదుపాయం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా బస్టాండ్‌ను ఆధునీకరించాలన్నారు. కాగా.. ఈ ప్రతిపాదనలకు ఆర్టీసీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన పెన్షన్ విధానం రద్దు చేసి, పాత విధానాన్ని అమలు చేయాలంటూ రైల్వే మజ్దూర్ యూనియన్ వివిధ విభాగాల కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసరెడ్డి, తిరుమలదేవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఆవరణలోని రిజర్వేషన్ కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనవరి 2004 నుంచి జాయిన్ అయిన ఉద్యోగుల్లో రిటైర్ అయినవాళ్లకు నెలకు రూ.4000 లోపు పెన్షన్ వస్తే, పాత విధానంలో రూ.40 వేల వరకు వస్తోందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేవారికే 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓటు వేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. పాత పెన్షన్ విధానం సాధించే కార్యాచరణలో భాగంగా పార్లమెంట్ వర్షాకాలం సమావేశాల్లో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంతో పాటు సెప్టెంబరు 18న భారత్ బంద్ నిర్వహిస్తామన్నారు.

రక్తహీనతపై అవగాహన కార్యక్రమం


మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రక్తహీనతపై కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.రమేష్, ఎంఈవో కె.స్వామినాయక్, సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, ఏపీఎం మహాలక్ష్మి పాల్గొన్నారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లలో 10 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయసుగల ఆడపిల్లలకు, 49 ఏళ్ల వరకూ గర్భిణులు, బాలింతలకు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన, తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి గ్రామ సచివాలయాల్లో సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి గురువారం స్కూళ్లలో, బుధ, శనివారాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ఎస్.లక్ష్మి, కె.సుధాకర్, సూర్యకుమారి, దైవకృప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: అశాస్త్రీయమైన టార్గెట్ల పేరుతో అధికారులు చేస్తున్న వేధింపులను తక్షణమే నిలిపివేయాలని తపాలా ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర తపాలా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు రెండోరోజు మంగళవారం నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. తపాలా ఉద్యోగ సంఘాల కార్యదర్శి బి.కొండబాబు మాట్లాడుతూ అధికారుల మొండి వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేయటానికి రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లో పోస్టల్ ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు చేశామన్నారు. టార్గెట్ల కారణంగా ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. తపాలా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని ఖాతాలు తెరిచే విధంగా అధికారులు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు యాజీ ప్రకాష్, ఏవీ నరసింహారావు పాల్గొన్నారు.

బ్యూటీస్పా కేసులో మరొకరి అరెస్టు

కంబాలచెరువు: స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని బ్యూటీస్పా కేసులో మరొకరిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్పా పేరుతో మసాజ్‌లు చేస్తూ, అక్కడ పనిచేస్తున్న యువతులను రహస్యంగా వీడియోలు తీసి బెదిరిస్తున్న నిర్వాహకురాలు విజయలక్ష్మిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి స్పా నిర్వహణకు సహకరిస్తున్న ప్రకాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకురాలు విజయలక్ష్మికి కోర్టు రిమాండ్ విధించింది. ప్రకాశం నగర్ పోలీసులు విచారణ చేపట్టారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: కాతేరుకు చెందిన బి.పోశయ్య ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారం చోరీ చేశారు. దీనిపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. జాలరు అయిన పోశయ్య ఈనెల 18న వేరే ప్రాంతానికి వెళ్లాడు. అయితే ఇంటి తలుపులు తీసి ఉండడంతో పక్క ఇంటి వ్యక్తి పోశయ్యకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. దీంతో పోశయ్య ఇంటికి వచ్చి చూడగా, బీరువాలోని 38 గ్రాముల బంగారం, 12 తులాల వెండి మాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: స్థానిక కంబాలచెరువు చెందిన అప్పన్న లక్ష్మణరావు (55) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు ఈ నెల 20న పురుగుమందు తాగాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య రక్ష

మధురపూడి: ఆయుష్మాన్ భారత్ కింద పేదలు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆధార్ ఈ–కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని రాజమహేంద్రవరం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి స్పష్టం చేశారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కోరుకొండ, గోకవరం మండలాల సచివాలయం, ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎల్‌డీఓ పి.వీణాదేవి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద పోర్టల్‌లో అందుబాటులో ఉన్న కుటుంబాల ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యభద్రత కల్పించడం సాధ్యమవుతోందన్నారు. కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ సరేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోకవరం ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ రవిచంద్ర, కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్యశాంతి, సచివాలయం కార్యదర్శులు, ఏఎన్ఎం, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపవాస ప్రార్థనలు


కోటికేశవరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మధురపూడి: ఏసుక్రీస్తు శ్రమలను అనుభవించి, శిలువపై మరణించిన కాలాన్ని పురస్కరించుకుని క్రైస్తవులందరూ 40 రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇవి బుధవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో పాటు ప్రసంగాలుంటాయి. కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో లూథరన్, ఆర్‌సీఎం మిషనరీలకు చెందిన వందల చర్చిల్లో ప్రార్థనలు జరుగుతాయి. 40 రోజుల ప్రార్థనల్లో క్రైస్తవులందరూ భక్తి శ్రద్ధలతో పాల్గొంటారు. కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలోని సెయింట్ పాల్స్ లూథరన్, కోరుకొండలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. శ్రమకాలం 40 రోజులకు ప్రారంభంగా భస్మ బుధవారం పండగ నిర్వహిస్తారు. సంబంధిత పాస్టర్లు ప్రార్థనలు చేసి, అందరికీ భస్మాన్ని (బూడిద)ను పంచిపెడతారు. గత సంవత్సరం మట్టల ఆదివారం రోజున ప్రదర్శనలు చేసిన వాటిని కాల్చి బూడిద చేస్తారు. ఈ బూడిదను అందరికీ పంపిణీ చేస్తారు. శ్రమకాలానికి సన్నద్ధమవుతూ క్రైస్తవులు నుదిటపై బూడిదను పూసుకుంటారు. ఏప్రిల్ 7న గుడ్‌ఫ్రైడే, 9వ తేదీన ఈస్టర్ పండగలు నిర్వహిస్తారు.

ఆక్రమణల చెరలో చెరువులు

- యథేచ్ఛగా కబ్జా
- ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు


చక్రద్వారబంధంలో ఆక్రమణకు గురైన ఊర చెరువు

రాజానగరం: గ్రామాలు, నగరాలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో మన పూర్వీకులు ముందుచూపుతో వ్యవహరించారనేది జగమెరిగిన వాస్తవం. అయితే ఆధునీకరణ పేరుతో నేటితరం అందమైన భవంతులు నిర్మిస్తున్నారు గానీ, జన జీవనానికి సరిపడే విధంగా మౌలిక సదుపాయాలను మాత్రం సమకూర్చలేకపోతున్నారు. కనీసం ఇప్పటి వరకు మన పూర్వీకులు ఏర్పాటు చేసిన చెరువులు తదితర వాటిని కూడా కాపాడుకోలేని దుస్థితిలో నేటి ఆధునిక సమాజం పయనిస్తోంది. బలవంతుడిదే రాజ్యమన్నట్టుగా పూర్వీకులు ఏర్పాటు చేసిన వసతులను కొందరు ప్రబుద్ధులు కబళించి, ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు.

చెరువులు కనుమరుగు

మన పూర్వీకులు ఎంతో ఆలోచించి, భావితరాలకు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని నివాస ప్రాంతాలలో మురుగు నీరు, ముంపునీరు దిగువ ప్రాంతాలకు సులువుగా పోయేందుకు, మంచినీటి, సాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలుగా గ్రామీణ, నగర ప్రాంతాలలో చెరువులను ఏర్పాటు చేశారు. ఆధునిక కాలంలో జనాభా సంఖ్యకనుగుణంగా వాటి సంఖ్య పెరగకపోగా ఉన్నవాటినే కబళిస్తున్నారు. గుడులు, గోపురాల పేరుతో కొంతమంది ఆక్రమిస్తుంటే, మరి కొందరు పలుకుబడితో కబ్జా చేసేస్తూ, భావితరాలకు సమస్యాత్మక వాతావరణాన్ని ప్రసాదించేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే భారీవర్షాలకు అనేక ప్రాంతాలు ముంపు బారిన పడుతూ జనాలు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు అనేకం చూస్తున్నాం. అయినా ఆలోచించే వారే కరువవుతున్నారు.

గుడి పేరుతో కబ్జా

చక్రద్వారబంధంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల వద్ద జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డును ఆనుకుని ఉన్న ఊర చెరువును కొంతమంది వ్యక్తులు రాత్రి రాత్రి కబ్జా చేశారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో పడమర వైపు భాగాన్ని (రెండు ఎకరాల వరకు) మట్టితో పూడ్చివేశారు. గ్రామంలో ఉన్న రెండు వర్గాలలో ఒక వర్గం ఈ పనికి పాల్పడితే రెండో వర్గం వ్యతిరేకిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై పంచాయతీ అధికారులు ఆక్రమణదారులను ప్రశ్నిస్తే, గుడి కోసం చేశామంటూ దర్పాన్ని ప్రదర్శించడం విశేషం. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ని వివరణ కోరగా విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లానన్నారు.

నియోజకవర్గంలో 34 చెరువుల ఆక్రమణ

నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో శివారు గ్రామాలతోపాటు 72 గ్రామాలుంటే 218 చిన్న, పెద్ద చెరువులున్నాయి. వీటిలో ఇప్పటికే 34 చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఇటువంటి ఆక్రమణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామాలలో చెరువులు, పుంతలు మున్నగు వాటి ఆక్రమణలను నివారించుటలో పంచాయతీ కార్యదర్శికి అధికారం ఉంది. ఇందుకుగాను 2011లో ప్రభుత్వం 188 జీఓను జారీ చేసింది. ఇటీవల సుప్రీంకోర్టు కూడా చెరువులను, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, ఆక్రమణలకు గురైతే తగిన చర్యలు తీసుకుని, వాటిని పరిరక్షించాలని తీర్పు ఇచ్చింది. అయినా ప్రభుత్వ జీఓలు, కోర్టు తీర్పులు ఆచరణలో కానరావడం లేదు.